
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శుక్రవారం 14 ఫిబ్రవరి 2025



శ్రీకాకుళంలో 'తండేల్' సందడి

- ఘనంగా విజయోత్సవం
- భారీగా తరలివచ్చిన అభిమానులు.
- నాగచైతన్య, సాయిపల్లవి, అల్లు అరవింద్‌ల డ్యాన్స్

6లో






హీరోయిన్ సాయిపల్లవి అభివాదం

శ్రీకాకుళం కోడిరామ్మూర్తి స్టేడియంలో 'తండేల్' విజయోత్సవ సభకు తరలివచ్చిన అభిమానులు, జిల్లావాసులు

అభివాదం చేస్తున్న హీరో నాగచైతన్య

శ్రీకాకుళం/అర్బన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) : 'తండేల్' విజయోత్సవ వేళ శ్రీకాకుళంలోని కోడిరామ్మూర్తి స్టేడియం.. 'అక్కినేని' అభిమాన సంద్రంగా మారింది. ఎచ్చెర్ల మండలం డి.మత్స్యలేశంలోని మత్స్యకారుల యధార్థగాథ ఆధారంగా తెరకెక్కిన 'తండేల్' సినిమా విజయవంతం కావడంతో చిత్ర యూనిట్ గురువారం సాయంత్రం శ్రీకాకుళం తరలివచ్చింది. సినీ హీరో అక్కినేని నాగచైతన్య, హీరోయిన్ సాయి పల్లవితోపాటు నిర్మాతలు అల్లు అరవింద్, బన్నీవాసు, దర్శకుడు చందూ మొండేటి, రచయిత కార్తీక్ తదితరులు విజయోత్సవ సభలో సందడి చేశారు. హీరో హీరోయిన్ అభిమానులకు అభివాదం చేస్తూ.. 'నమో నమఃశివాయ, హైలెస్సొ హైలెస్సా' పాటలకు స్టెప్పులేస్తూ అలరించారు.

వామ్మో.. ఓపీ!



- భారీగా ఫీజులు పెంచేసిన ప్రైవేటు ఆసుపత్రులు
- పది రోజుల్లో ఒక్కసారే వైద్యుడు చూస్తారంట
- 'కార్పొరేట్'తో సమానంగా డబ్బుల వసూళ్లు
- ప్రత్యేక వైద్య నిపుణుల టోకెన్‌కు డబుల్ రేట్లు
- పర్యవేక్షణ చేయని వైద్యశాఖ ఉన్నతాధికారులు
- ప్రైవేటు క్లినిక్‌లలో ప్రభుత్వ వైద్యులే అధికం

ప్రైవేటు ఆసుపత్రులపై నిఘా..

జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రులపై నిఘా పెడతాం. ప్రభుత్వ వైద్యుడిగా జీతం తీసుకుంటున్నవారు తప్పనిసరిగా డ్యూటీ వేళల్లో ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే విధులు నిర్వహించాలి. డ్యూటీ ముగిశాక ఎక్కడ ప్రైవేటు వైద్యం చేసుకున్నా అభ్యంతరం లేదు. ఎక్కడైనా ప్రభుత్వ వైద్యులు.. ప్రభుత్వ డ్యూటీ ఎగ్గొట్టి ప్రైవేటు క్లినిక్‌లలో ఉన్నట్టు మా దృష్టికి వస్తే.. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. ఇటువంటి వాటిపై కొద్దిరోజుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తాం.

-బాలమురళీకృష్ణ, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి

- పలాస నియోజకవర్గానికి చెందిన ఒక రోగి ఇటీవల న్యూరాలజిస్టు కోసం శ్రీకాకుళంలోని డేఅండ్ నైట్ జంక్షన్‌లో ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాడు. ఓపీ టోకెన్‌కు రూ.500 చెల్లించాడు. అక్కడే వైద్యపరీక్షలు చేసుకున్నాడు. స్కాన్ కోసం మరో కార్పొరేట్ ల్యాబ్‌కు పంపారు. వారం రోజులు తర్వాత మళ్లీ ఆసుపత్రికి వస్తే.. అప్పటికే ఒకసారి మధ్యలో వైద్యసలహాకు వచ్చారని.. ఇప్పుడు చెల్లుబాటుకాదని.. మళ్లీ టోకెన్ తీసుకోవాలని సిబ్బంది చెప్పారు. దీంతో మళ్లీ టోకెన్ తీసుకుని న్యూరాలజిస్టును సంప్రదించాడు.

- శ్రీకాకుళం నగరానికి చెందిన ఓ చిన్నారికి ఇటీవల జ్వరం రాగా.. రాత్రివేళ డేఅండ్‌నైట్ జంక్షన్‌లోని చిన్నపిల్లల వైద్యులకు సంబంధించిన ఓ ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తీసుకువెళ్లారు. ఎమర్జెన్సీ టోకెన్ కింద రూ.వెయ్యి తీసుకున్నారు సిబ్బంది. సాధారణ టోకెన్ రూ.600 అని.. అదీ అందుబాటులో లేవని.. ఎమర్జెన్సీ టోకెన్ అయితే రెడీగా ఉన్నాయని చెప్పడంతో చేసేదిలేక ఆ తల్లిదండ్రులు తమచిన్నారి కోసం అడిగినంత ఇచ్చారు. అక్కడే వైద్యపరీక్షలు నిర్వహించి.. ఆ ఆసుపత్రిలోనే వేలాది రూపాయల మందులు కూడా కొనుగోలు చేశారు.

శ్రీకాకుళం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి):

..ఇలా వైద్యం కోసం వెళ్లే రోగుల వద్ద ప్రైవేటు ఆస్పత్రులు డబ్బులు పిండేస్తున్నాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో నిబంధనలు ఎలా అమలవుతున్నాయి.. అక్కడ వైద్యం.. తీసుకుంటున్న ఫీజులు.. అందిస్తున్న సేవలు.. వైద్యులు, సిబ్బందితోపాటు ల్యాబ్‌ల్లో అర్హత కలిగిన వారే ఉన్నారా? అన్నది ఎవరికీ తెలియదాయె. ఎందుకంటే.. అధికారుల తనిఖీలు లేవు. ప్రైవేటు ఆస్పత్రులు తమ పరిధిలో ఉండవు.. వాటికి నిబంధనలతో సంబంధం లేదు అన్నట్లు అధికారులు వ్యవహరిస్తున్నారు. దీంతో పుట్టగొడుగుల్లా ఆస్పత్రులు వెలుస్తున్నాయి. రోగుల జబ్బులు.. వారి భయాన్ని డబ్బుగా మార్చుకుంటున్నాయి.

- శ్రీకాకుళంలో అత్యధికంగా ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రిలు ఉన్నాయి. జిల్లాలోని పలాస, సోంపేట, పాతపట్నం, నరసన్నపేట, ఆమదాలవలస, శ్రీకాకుళం తదితర ప్రాంతాలతోపాటు ఒడిశా రాష్ట్రం నుంచి కూడా చాలామంది ప్రజలు వైద్యం కోసం జిల్లా కేంద్రానికి వస్తుంటారు. ప్రభుత్వ ఆసుపత్రిల సంగతి అలా ఉంచితే.. రోజువారీ ప్రైవేటు ఆసుపత్రిలకు వెళ్లేవారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రత్యేక వైద్యులు(స్పెషలిస్టులు) అందుబాటులో ఉంటారన్న కారణంతో రోగులు అక్కడకు వెళ్తున్నారు. ఇదే అదనుగా.. ఒకప్పుడు సామాన్యుడికి అందుబాటులో ఉండే వైద్యుని ఓపీ ధరను ఇప్పుడు గణనీయంగా పెంచేశారు. వైజాగ్‌తో సమానంగానే శ్రీకాకుళంలోనూ ఓపీ ధరలు వసూలు చేస్తున్నారు. అక్కడ వైద్యానికి.. సౌకర్యాలకు.. ఇక్కడి పరిస్థితులతో పోల్చితే ఎవరివద్ద సమాధానం లేదాయె. శ్రీకాకుళంలో అత్యధిక ప్రైవేటు ఆసుపత్రిల్లో కనిష్ఠంగా రూ. 300 నుంచి రూ.వెయ్యి వరకు ఓపీ ధరలు ఉన్నాయి. జనరల్ మెడిసిన్ వైద్యుని ఓపీ అయితే రూ.300 నుంచి రూ.500 వరకు ఉంది. పైగా ఒకసారి రోగిని చూశాక.. మళ్లీ అదే ఫైలు పట్టుకుని ఇతర సమస్యలతో వైద్యుని వద్దకు వస్తే కేవలం పదిరోజుల్లో

(మిగతా 6వ పేజీలో..)





బిర్లంగి గ్రామ పంచాయతీ కార్యాలయం

ఆ నిబంధన సడలింపు

- స్థానిక సంస్థల్లో పోటీకి సంతానం అడ్డుకాదు
- గెజిట్ జారీచేసిన కూటమి ప్రభుత్వం

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 13: స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల పోటీకి సంబంధించి సంతానం నిబంధనలను కూటమి ప్రభుత్వం సడలించింది. ఇద్దరు కన్నా ఎక్కువ పిల్లలు ఉంటే పంచాయతీ ఎన్నికల్లో పోటీకి అనర్హులు అన్న నిబంధనను పంచాయతీరాజ్ చట్టం నుంచి తొలగించింది. ఎంతమంది పిల్లలు ఉన్నా పోటీకి అర్హులేనని స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించి అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం కూడా పొందింది. గురువారం న్యాయశాఖ ఏకంగా గెజిట్ జారీ చేసింది. దీంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

- 30 ఏళ్ల కిందట దేశ జనాభా రికార్డుస్థాయిలో పెరిగింది. అప్పటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కీలక నిర్ణయాలు

(మిగతా 7వ పేజీలో..)

దివ్యాంగులకు వైద్య పరికరాలు అందజేయాలి

- జిల్లా ప్రధాన న్యాయాధికారి జేప మౌలానా



గుజరాతీపేట, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 19 ఏళ్లలోపు దివ్యాంగులను గుర్తించి.. తగు వైద్య పరికరాలు సమకూర్చాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా సూచించారు. స్థానిక జిల్లా కోర్టు సమావేశ మందిరంలో జిల్లాలోని పలు శాఖల అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా మాట్లాడుతూ.. దివ్యాంగుల స్థితిగతులను తెలుసుకుని.. వారికి వైద్య సదుపాయాలు సమకూర్చేలా ప్రయత్నించాలని తెలిపారు. కిందిస్థాయి సిబ్బంది సైతం ప్రత్యేక చొరవ చూపాలన్నారు. సమావేశంలో డీఈవో ఎస్. తిరుమల చైతన్యతోపాటు వైద్య, రెవెన్యూ, స్త్రీ శిశు సంక్షేమశాఖ, విభిన్న సామర్థ్య శాఖ, డీఆర్డీఏ, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.



ప్రేమ బంధం..

ఎంతో మధురం

- అర్థం చేసుకుంటేనే అందమైన జీవితం
- ఒకరిపై ఒకరికి నమ్మకం అవసరం
- నేడు ప్రేమికుల దినోత్సవం

6లో

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో పది మంది

- ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ
- 27వ తేదీన పోలింగ్
- 22,493 మంది ఓటర్లు
- 123 కేంద్రాలు.. ఏయూలో మార్చి 3న ఓట్ల లెక్కింపు
- రిటర్నింగ్ అధికారి, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్

అభ్యర్థులు వీరే...

1. కోసూరు రాధాకృష్ణ
2. నూకల సూర్యప్రకాష్
3. పాకలపాటి రఘువర్మ
4. కోరెడ్ల విజయగౌరి
5. రాయల సత్యనారాయణ
6. గాదె శ్రీనివాసులనాయుడు
7. సత్తలూరి పద్మావతి
8. పెదపెంకి శివప్రసాద్
9. సుంకర శ్రీనివాసరావు
10. పోతల దుర్గాప్రసాద్


విశాఖపట్నం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పది మంది పోటీలో ఉన్నారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ వెల్లడించారు. నామినేషన్ల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఈసీ హాలులో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పోలింగ్‌కు సంబంధించి ఏర్పాట్లు ప్రారంభించామన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు పటిష్ఠ చర్యలు తీసుకున్నామన్నారు. దీనిలో భాగంగానే విశాఖ జిల్లాలో 12 ఎంసీసీ బృందాలు, ప్రతి మండలానికి ఒక ఫ్లైయింగ్ స్క్వాడ్ నియమించామన్నారు.

శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో ఈనెల 27వ తేదీ ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ పోలింగ్ నిర్వహిస్తామన్నారు. ఆరు జిల్లాల పరిధిలో 22,493 మంది ఓటర్లు (పురుషులు 13,508 మంది, మహిళలు 8,985) మంది ఉన్నారన్నారు. మొత్తం 123 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు వీలుగా పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు సమకూర్చున్నామని, వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫీ ఏర్పాటుచేస్తున్నామన్నారు. పోలింగ్‌లో పాల్గొనే సిబ్బందికి రెండు

(మిగతా 7వ పేజీలో..)



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్. చిత్రంలో డీసీపీ అజితా వేజెండ్ల, డీఆర్వో భవానీశంకర్ ఉన్నారు



కొర్రాయి గేటు కూడలిలో పిల్లర్ వద్ద మరమ్మతులు

ఫ్లైఓవర్ కుంగుతోంది

- కొర్రాయిగేటు వద్ద ప్రమాదకర స్థితికి మారిన వైనం
- ఆందోళనలో ప్రజలు

6లో



సోణాక్షిత (ఫైల్)

ఉసురు తీసిన చేగోడి

- గొంతులో ఇరుక్కుని చిన్నారి మృతి
- లంకపేటలో విషాదం

7లో

స్పెషల్ బీఈడీ పరీక్ష ప్రశ్నపత్రంలో తప్పిదం

7లో

శ్రీకాకుళంలో తండేల్ సందడి



మాట్లాడుతున్న నాగచైతన్య, సాయిపల్లవి



డ్యాన్స్ చేస్తున్న సాయిపల్లవి, నాగచైతన్య, అల్లు అరవింద్

ఘనంగా విజయోత్సవం

- భారీగా తరలివచ్చిన అభిమానులు
- సాయిపల్లవి, నాగచైతన్య, అల్లు అరవింద్‌ల డ్యాన్స్

శ్రీకాకుళం/అర్బన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): 'శ్రీకాకుళం వెనుక ఓ చరిత్ర ఉంది' అని సినీ హీరో అక్కినేని నాగచైతన్య పేర్కొన్నారు. ఎచ్చెర్ల మండలం డి.మత్స్యలేశం గ్రామానికి చెందిన మత్స్యకారుల యధార్థ గాథ ఆధారంగా తెరకెక్కించిన 'తండేల్' సినిమా విజయోత్సవ సభను గురువారం రాత్రి శ్రీకాకుళంలో నిర్వహించారు. స్థానిక కోడి రామ్మూర్తి స్టేడియంలో నిర్వహించిన ఈ వేడుకలో సినీ తారలు నాగ చైతన్య, సాయిపల్లవి, నిర్మాతలు అల్లు అరవింద్, బన్నీ వాసు, దర్శకుడు చందు మొండేటి, రచయిత కార్తీక్ సందడి చేశారు. ఈ సినిమా ఇతివృత్తానికి మూలమైన గనగళ్ల రామారావు, నూకమ్మ దంపతులతో కలసి సక్సెస్ మీట్‌లో మాట్లాడారు. అనంతరం 'నమో నమఃశివాయ, హైలెస్సో హైలెస్సా' పాటలకు సాయిపల్లవి, నాగచైతన్య, అల్లు అరవింద్ డ్యాన్స్ చేశారు. ఆ తర్వాత పోలీసులతో కలసి 'డ్రగ్స్ వద్దు బ్రో' పోస్టర్‌ను ఆవిష్కరించారు. కథానాయకుడు నాగచైతన్య, నాయిక సాయిపల్లవితో పాటు చిత్ర యూనిట్ సభ్యులను అభిమానులు గజమాలలతో సత్కరించారు.

యాస కోసం ఎటకారం సేస్తే రాజులమ్మ జాతరే: నాగ చైతన్య

'శ్రీకాకుళం ప్రేక్షకులందరికీ వెరీ వెరీ గుడ్ ఈవెనింగ్. చందూ మొండేటి, కార్తీక్ నాకు ఈ కథ చెప్పడంతో తొలుత డి.మత్స్యలేశం గ్రామానికి వెళ్లాను. అక్కడ మత్స్యకారుల చేపల వేట, వల ఎలా విసురుతారు.. ఇవన్నీ తెలుసుకుని నేర్చుకున్నా. ఆ తర్వాతనే 'తండేల్' రాజు కేరెక్టర్‌కు డిజైన్ చేశారు. సినిమా రిలీజైన తర్వాత అందరి మన్ననలు అందుకున్నా. ఈ కేరెక్టర్‌తో ఎంతో ప్రేరణ పొందాను. శ్రీకాకుళం వెనుక ఓ చరిత్ర ఉందని తెలుసుకున్నా. శ్రీకాకుళమే ఒక అద్భుతం. ఆ కేరెక్టర్ చాలా కష్టమైనది. ప్రాంతా న్ని బట్టి నీటి రుచి మారుద్ది.. మట్టి వాసన మారుద్ది.. గాలి తీరు మారుద్ది.. అలాగే యాస, బాస మారుతుంది. యాస కోసం ఎటకారం సేస్తే రాజులమ్మ జాతరే. దద్దా సెప్పినాగా.. ఈ పాలి యేట దుల్లగొట్టేస్తామని. తండేల్ సినిమా రాజులమ్మ జాతర.. మీరందరూ చాలా జాగ్రత్తగా వెళ్లాలి. సాయిపల్లవి ఇక్కడకు వచ్చి మీ ప్రేమను తెలుసుకున్నారు. అల్లు అరవింద్, వాసు, చందూ మొండేటి.. వారు లేకపోతే నేను ఇక్కడకు వచ్చేవాడిని కాదు.

కథ వినగానే కంట తడి పెట్టుకున్నా: సాయిపల్లవి

శ్రీకాకుళం జనాలను చూసినందుకు ఆనందంగా ఉంది. గనగళ్ల రామారావు (ఒరిజినల్) చెప్పినప్పుడే శ్రీకాకుళం ప్రజలకు థ్యాంక్స్ చెప్పేందుకు సిద్ధమయ్యాం. మత్స్యకారుల జీవితాల్లో ఇంతటి డ్రామా ఉంటుందని తెలిసి.. పాకిస్తాన్ జైలులో గడిపి... అక్కడి నుంచి విడుదల కావడానికి పడిన కష్టాలు వింటూనే కంటతడి పెట్టుకున్నా. వీరి జీవితాన్ని సినిమా తీయడానికి అనుమతించినందుకు కృతజ్ఞతలు. ఇటువంటి పాత్రలో నటించడం దేవుడందించిన భాగ్యంగా ఫీలవుతున్నా. రామారావుతో కూర్చుని కథ కోసం మాట్లాడేటప్పుడు.. రెండు గంటల్లో ఈ సినిమా ఎలా పూర్తవుతుందని అనుకున్నా. కానీ డైరెక్టర్ చక్కగా చిత్రీకరించారు. కథపై నమ్మకముంది. విన్నప్పుడే ఇటువంటి పాత్రలు చేయాలని అనుకున్నా. శ్రీకాకుళం యాస నేర్చుకునేందుకు యోగి అనే వ్యక్తి శిక్షణ ఇచ్చాడు. అందరికీ కృతజ్ఞతలు. మీ రుణం తీర్చుకోలేను. మానిటర్ వెనుక చాలా హ్యాపీగా ఉన్నాం. ఒక సెట్‌గా ఈగో లేకుండా ఉన్నాం. స్నేహితులందరం కలసి సినిమా తీసినట్లయ్యింది. మా డైరక్టర్ చాలా కూల్‌గా సలహాలు ఇచ్చారు.

శ్రీకాకుళం జనాలు దుల్లగొట్టేశారు: దర్శకుడు చందు మొండేటి

శ్రీకాకుళం జనాలు దుల్లగొట్టేశారు. ఉత్తరాంధ్ర నుంచి సినిమా తీస్తే.. ప్రపంచం నలువైపులా ఆదరించేలా కథ తయారైంది. సక్సెస్ వరించింది. లేడీ సూపర్‌స్టార్.. మా పవర్‌స్టార్ సాయిపల్లవి అంగీకరించడమే ఈ సినిమాకు పెద్ద విజయం. నా ప్రేమకథ స్వీయ అనుభవం.. లీడర్ షిప్ అల్లు అరవింద్. క్వాలిటీగా సినిమా రావడానికి వంశీ, శేఖర్ ఎంతో ఉపయోగపడ్డారు. వీళ్లకు థ్యాంక్యూ. నాగ చైతన్య, సాయిపల్లవి కెమిస్ట్రీ బాగా కుదిరింది. లవ్‌స్టోరీ నుంచి బాగా ఉంది. హిట్ పెయిర్‌గా ఉన్నారు. అరవింద్ గారి వద్ద పది సంవత్సరాలు పనిచేస్తే విజయాలు వచ్చేస్తాయి.

కోడి రామ్మూర్తి జీవిత గాథను వెబ్‌సిరీస్‌గా తీస్తాం : నిర్మాత అల్లు అరవింద్

ఈ ప్రాంతం నుంచి తీసుకున్న కథ ఆధారంగా 'తండేల్' సినిమాను తెరకెక్కించాం. ప్రజలు ఎంతగానో ఆదరించారు. శ్రీకాకుళం ప్రజలకు రుణపడి ఉంటా. శ్రీకాకుళం కోసం తెలుసుకుందామని ఆలోచన వచ్చినప్పుడు కోడి రామ్మూర్తి గొప్పదనం గురించి చదివా. ఈ ప్రాంతంలో పుట్టి.. ఎన్నో ఛాలెంజ్‌లు చేసి శ్రీకాకుళానికి పేరు ప్రతిష్ఠలు తీసుకువచ్చారు. ఆయన కథ ఆధారంగా వెబ్ సిరీస్‌గానీ.. సినిమా గానీ తీసే ఆలోచనలో ఉన్నాం. రోడ్డుపై రెండు కార్లు ఆపగలిగిన కోడి రామ్మూర్తి శాఖాహారి కావడం.. ఓ శాఖాహారి ఇంత గొప్ప యోధుడిగా ఎదగడమన్నది స్ఫూర్తినిచ్చింది. 'తండేల్‌'లో నాగచైతన్య, సాయిపల్లవిని దర్శకుడు తోలుబొమ్మలుగా చేసి సినిమాను అద్భుతంగా తెరకెక్కించారు. సినిమా చూసిన ఎవరూ ఆ పాత్రలను కానీ.. నాగచైతన్య సాయిపల్లవిలను మరిచిపోలేరు. నాగార్జున కోసం మంచి కథ తయారవుతోంది. కథ రాగానే సినిమా తీస్తాం. ఈ సినిమా ప్రాఫిట్‌ను బన్నీ వాసుతో షేర్ చేసుకుంటా. మా అబ్బాయిలకు షేర్ ప్రాఫిట్ ఇస్తా. ఆ సినిమాతో మరో సినిమా తీస్తా.

డి.మత్స్యలేశం.. ఓ సంచలనం: నిర్మాత బన్నీ వాసు

రెండు రోజుల్లో ఇంతటి జనం వస్తారని ఊహించలేదు. శ్రీకాకుళం వచ్చేటప్పుడు ఇక్కడి ప్రజలు ఎంతగానో ఆదరిస్తారని విన్నాను. అది ఇక్కడి జనాన్ని చూడగానే అర్థమైంది. శ్రీకాకుళంలోని డి.మత్స్యలేశం గ్రామం సినీ ఇండస్ట్రీలో సంచలనం సృష్టించింది. 'తండేల్' సినిమాతో మత్స్యలేశం మత్స్యకారుల గాథను ప్రపంచానికి తెలియజేశాం.



'డ్రగ్స్ వద్దు బ్రో'.. పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చిత్ర యూనిట్ సభ్యులు

సాయిపల్లవి ప్రాణం పోశారు : రచయిత కార్తీక్ తోట

చిత్ర యూనిట్ సక్సెస్ మీట్ కోసం శ్రీకాకుళం రావడం ఆనందంగా ఉంది. జిల్లా వాసిగా ఈ చిత్ర కథ రాయడం.. ఇంతటి విజయాన్ని చవిచూడడం ఇంకా ఆనందంగా ఉంది. కో ప్రొడ్యూసర్ భానుకి కథ చెప్పాక.. బన్నీ వాసు వద్దకు తీసుకువెళ్లి పరిచయం చేశారు. అక్కడి నుంచి డైరెక్టర్ చందు మొండేటి నన్ను ఎంతగానో ఆదరించారు. కథ ఇవ్వడంతో రచయిత పని అయిపోలేదు. నన్ను పక్కనే ఉంచి ఆదరించారు. సాయిపల్లవి ఈ సినిమాకు ప్రాణం పోశారు. బన్నీ వాసు లేకుంటే నేను లేను. అక్కినేని అభిమానులు బంగారం.



వామ్మో.. ఓపీ!

(ఐదో పేజీ తరువాయి)

ఒక్కసారి మాత్రమే అనుమతిస్తున్నారు. మరోసారి ఆసుపత్రికి వస్తే మళ్లీ టోకెన్ తీసుకోవాల్సిందే. ఇంకొన్ని ఆసుప త్రిల్లో వారం రోజులే గడువు విధిస్తున్నారు. అలాగే నెఫ్రాలజిస్టు, న్యూరాలజిస్టు, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు, కార్డియాలజిస్ట్ వైద్యుల వద్ద ఓపీ చాలా డిమాండ్‌గా ఉంటోంది. వారి టోకెన్‌లు లభించడమే గగనం అన్నట్లుగా ఉంది.

● పిల్లల వైద్యులకు డబుల్..

రోగం అనేది ఎవరికైనా బాధ ఒకటే. అయితే పిల్లలకు నలత చేస్తే కుటుంబసభ్యు లు మరింత తల్లడిల్లిపోతారు. పిల్లలను అత్య వసరంగా వైద్యుల వద్దకు తీసుకెళ్లాలంటే.. ఎమర్జెన్సీ టోకెన్ కింద ఓపీ ధరకు రెట్టింపు వసూలు చేస్తున్నారు. ఏమీచేయ లేక.. వైద్యులు అడిగినంత చెల్లించి వైద్యం చేయించుకుంటున్నారు. ప్రభుత్వాలు ఎన్ని ఆరోగ్య పథకాలు అమల్లోకి తీసుకువచ్చినా.. ఓపీతోపాటు.. సాధారణ వైద్యం.. రక్తపరీక్షలు.. ఇతరత్రా పరీక్షలకు పథకం అమలు కాదన్నది క్షేత్రస్థాయిలో నిజం. అలాగే ప్రభుత్వ ఆసుపత్రిల కంటే మెరుగైన వైద్యం అందుతుందన్న భావనతో పేదలు సైతం ప్రైవేటు ఆసుపత్రిలకే మొగ్గు చూపుతున్నారు. దీంతో రోజురోజుకీ ప్రైవేటు ఆసుపత్రిలన్నీ కార్పొరేట్ ధరలను తలపిస్తున్నాయి. కొన్ని ఆసుపత్రిల్లో వైద్యుల ఓపీ ధర.. రక్తపరీక్షలకు, స్కానింగ్‌కు చెల్లించాల్సిన ఫీజు.. ఇవేవీ బోర్డులు ప్రకటించడం లేదు. ప్రైవేటు ఆసుపత్రులతో సంబంధం లేదన్నట్లుగా జిల్లా వైద్యఆరోగ్యశాఖ వ్యవహరిస్తోంది. అసలు ప్రైవేటు ఆసుపత్రిల వ్యవహారం ఏనాడూ బయటపెట్టిన దాఖలాలు లేవు.

● అక్కడ హాజరు.. ఇక్కడ వైద్యం..

శ్రీకాకుళంలోని దాదాపు 90 శాతం ప్రైవేటు ఆసుపత్రిల్లో వైద్యులందరూ ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్నవారే. అందులో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికు చెందినవారే. ఉదయం అలా సమయానికి వెళ్లి.. ఎఫ్ఎల్ఆర్ఎస్‌లో హాజరు వేసేసి.. మళ్లీ కొద్దిసేపట్లో బయటకు వచ్చేసి.. గంటల తరబడి సొంత క్లినిక్‌లకు అతుక్కుపోతున్నారు. ఓపీ చూసి వెళ్లి మళ్లీ హాజరు వేసి వస్తుండడం నిత్యకృత్యంగా మారింది. నిబంధన ప్రకారం డ్యూటీ వేళల్లో ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే సేవలు అందించాలి. డ్యూటీ ముగిశాక ప్రైవేటు క్లినిక్‌లకు వెళ్లొచ్చు. కానీ సాధారణ వైద్యుల నుంచి.. స్పెషలిస్టుల వరకు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి చెందినవారు పగలు కూడా సొంత క్లినిక్‌లో ఉంటున్నారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్.. నెలలో ఒకరోజైనా సరే ఉదయం పది గంటల నుంచి కనీసం పది ఆసుపత్రిలు శ్రీకాకుళంలోనే తనిఖీ చేస్తే.. అక్కడ ఉండే ప్రభుత్వ ఆసుపత్రిల ప్రైవేటు క్లినిక్ సేవలు బయటపడతాయి. గతంలో కానీ.. ఇప్పుడు కానీ ఉన్నతాధికారులు ప్రైవేటు ఆసుపత్రిలను తనిఖీ చేసే సాహసం చేయడంలేదు.

● టెస్టులు.. మందులూ ఆసుపత్రుల్లోనే..

ప్రైవేటు ఆసుపత్రిల నిర్వాహకులు.. అనుబంధంగా రక్తపరీక్షలు నిర్వహించే ల్యాబ్‌లు.. మందుల షాపులు కూడా పెట్టుకున్నారు. ఆయా ఆసుపత్రిల్లోనే పరీక్షలు నిర్వ హించుకోవాలి. అక్కడే వైద్యులు రాసిన మందులను కొనుగోలు చేయాలి. అలా అని వారు రాసే మందులు కూడా ప్రముఖ బ్రాండెడ్‌వి కాదు. అత్యధికం పీడీ కంపెనీలే. వైద్యులపై దాడికి పాల్పడితే కఠిన చర్యలుంటాయని సెక్షన్‌లతో సహా పోస్టర్లు అన్ని ప్రైవేటు ఆసుపత్రిల్లో ఉన్నాయి కానీ.. సరైన వైద్యం అందకున్నా.. రోగులకు ఇబ్బంది కలిగితే ఫలానావారికి ఫిర్యాదు చేయాలి.. ఫలానా అధికారి వద్దకు సమాచారం తీసుకువెళ్లాలన్న పోస్టర్లు ఎక్కడా లేవు. జిల్లాకేంద్రంలో పేరెన్నిక గల ప్రభుత్వ-ప్రైవేటు వైద్యులు.. ప్రజాప్రతినిధులకు బంధువర్గంలో చేరిపోయారు. దీంతో ప్రభుత్వ విధులకు డుమ్మాకొడుతున్నా.. ప్రజాప్రతినిధులు సైతం ప్రశ్నించలేని స్థితిలో ఉన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలను ఆకస్మిక తనిఖీ చేసి.. డ్యూటీ వేళల్లో వైద్యులు ఉంటున్నారా.. ప్రైవేటు క్లినిక్‌లకు అతుక్కుపోతున్నారా? అన్న పరిశీలిస్తే పరిస్థితిలో తక్షణమే మార్పు వస్తుంది. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో రాత్రివేళ అయితే.. ఎంతమంది వైద్యులు అందుబాటులో ఉంటున్నారో దేవుడికే ఎరుక. ఇప్పటికైనా ప్రైవేటు ఆసుపత్రిలపై నిఘా పెట్టి.. ఓపీ ధరలను స్థిరీకరించడమే కాకుండా.. రోగుల వద్ద తీసుకుంటున్న ఫీజులకు న్యాయంగా వైద్యం అందించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. అధికారులు నెలకోసారైనా తనిఖీలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రేమబంధం.. ఎంతో మధురం!

- అర్థం చేసుకుంటేనే అందమైన జీవితం
- ఒకరిపై ఒకరికి నమ్మకం అవసరం

నేడు ప్రేమికుల దినోత్సవం



● నరసన్నపేట మండలంలోని ఓ కుటుంబానికి చెందిన తల్లిదండ్రులకు ఒక్కడే కొడుకు. ప్రేమ వివాహం చేసుకున్నాడు. బిడ్డ మీద ప్రేమతో వీరి వివాహాన్ని తల్లిదండ్రులు ఆమోదించారు. వీరు కొడుకు ఇంటికి వెళ్లినప్పుడల్లా కోడలు ఏదో ఒక వంకతో భర్తతో గొడవ పెట్టుకోవడం.. లేదంటే పుట్టింటికి వెళ్లిపోవడాన్ని గమనించారు. కొడుకు, కోడలి మధ్య గొడవలు వస్తుండడంతో వాళ్ల ఇంటికి వెళ్లడం మానేశారు. కొన్నాళ్లకు ఇద్దరూ విడిపోయారు. వేర్వేరుగా ఉంటున్నారు.

సరుబుజ్జిలి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి)

...ప్రేమించి పెళ్లి చేసుకున్న ఇలాంటి అనేక జంటలది ప్రస్తుతం ఇదే పరిస్థితి. దీనికి కారణం ప్రేమ మీద సరైన అవగాహన లేకపోవడం... బంధాన్ని నిలుపుకోవడం ఎలాగో తెలియక పోవడమేనని చెప్పవచ్చు. సాధారణంగా ప్రేమలో ఉన్నప్పుడు ఒకరిని విడిచి ఒకరు ఉండలేమన్నట్టుగా ఉంటారు. ఒక్కరోజు ఫోన్ కాల్, మేసేజ్‌లు చేయలేకపోయినా ఏదో కోల్పోయినట్టు బాధ పడుతుంటారు. అలాంటి వారు పెళ్లి బంధంలో మాత్రం ఇమడలేకపోతున్నారు. గుండెల్లో పదిలంగా ఉండాల్సిన ప్రేమ ఒక్కోసారి ఆ గుండెలను చీల్చే వరకూ వెళుతోంది. తల్లిదండ్రులను ఎదిరించి వివాహం చేసుకున్న జంటల్లో చాలా మంది ఆర్థిక ఇబ్బందుల కారణంగానే దూరమవుతున్నారు. సరైన సంపాదన లేకుండా ప్రేమ పెళ్లిళ్లు చేసుకోవడమే దీనికి కారణం. అంతవరకు తల్లి దండ్రుల సంపాదన మీద ఆధారపడే వీరికి సొంతంగా బతికేందుకు అవసరమయ్యే డబ్బు సంపాదించేసరికి తత్వం బోధ పడుతోంది. ప్రేమ మైకంలో చదువును నిర్లక్ష్యం చేయడంతో సరైన ఉపాధి పొందలేకపోతున్నారు. పిల్లలు పుట్టేసరికి అసలైన జీవితం అంటే ఏమిటో తెలుస్తోంది. అది అపార్థాలకు... అనర్థాలకు.. విడిపోవడానికి కారణమవుతోంది. ఈ ప్రభావం పిల్లల భవిష్యత్తుపై పడుతోంది.

సుఖంగా ఉంటే చాలని...

ఒకప్పుడు ప్రేమిస్తే ఆమె/అతడి తోటిదే లోకంగా బతికేవారు. తల్లిదండ్రులను ఒప్పించి జీవిత భాగస్వామిగా చేసుకోనే వారు. ఆ ప్రేమ దక్కదని తెలిస్తే ఆమె/అతని జీవితం బావుంటే చాలని కోరుకునేవారు. ఇప్పుడు మాత్రం తనప్రేమను కాదన్న వారి ని అంతం చేయడమో...నలుగురిలో నగుబాటు చేయడమో ఫ్యాషన్‌గా మారింది. ఇది ఆఖరికి దాడులు...హత్యలకూ దారి తీస్తోంది. ఇది ఎంతమాత్రమూ సమర్థనీయం కాదు.

ప్రేమను గెలిపించండి..

చూపులు కలిసినంత సులువు కాదు.. మనసులు ముడిపడడం. ప్రేమంటే ఇద్దరిని ఒక్కటిగా చేసే అద్భుత బంధం. ఇలాంటి బంధం కలకాలం సాగాలంటే పరస్పరం అవగాహన.. అభిమానం ఉండాలని ప్రేమ వివాహాలతో ఒక్కటైన జంటలు ఆచరించి చూపిస్తున్నాయి. అలవాట్లు, అభిప్రాయాలు, జీవనశైలి, చూసే దృష్టి ఒకేలా ఉండాలని ఆశించవద్దు. ఒకరి మనోభావాలను మరొకరు గౌరవించుకోవడం, ఎదుటి వాళ్లను వాళ్లలాగే కొనసాగనిస్తేనే ప్రేమ పదిలంగా ఉంటుందని చెబుతున్నారు. ప్రతి ప్రేమ బంధంలోనూ ఎప్పుడో ఒకప్పుడు చేదు అనుభవాలు ఎదురవుతుంటాయి. వాటిపై పరస్పరం చర్చించుకొని... పరిష్కరించుకుంటే ఆ బంధం మధురమవుతుంది.

పెద్దల అంగీకారంతో ప్రేమ పెళ్లి...



నవీన్, అర్చన

సరుబుజ్జిలి మండలం నంది కొండ గ్రామానికి చెందిన దళిత యువకుడు ఇల్లాకుల నవీన్ ఐటీఐ చదివి గుంటూరు స్పిన్నింగ్ మిల్లులో ఉపాధి పొందుతున్నాడు. అదే మిల్లులో ఉపాధి పొందుతున్న ఒడిశా రాష్ట్రం బరంపురం పట్టణానికి చెందిన అర్చనతో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారిందని నవీన్ తెలిపారు. ఇద్దరివీ వేర్వేరు సామాజిక వర్గాలు. సుమారు ఏడాది పాటు ప్రేమలో ఉండి... తల్లిదండ్రులను ఒప్పించి పెద్దల అంగీకారంతో ఈ నెల 7న నందికొండలో వివాహం చేసుకున్నారు. ఇలా పెద్దల అంగీకారంతో పెళ్లి చేసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని నవీన్, అర్చన తెలిపారు.

పెద్దలను ఒప్పించండి..



రాము, గీత

సరుబుజ్జిలి మండలం శ్రీరామవలసకు చెందిన గొర్లె రాము, ఎల్ఎన్‌పేట మండలం కరకవలస గ్రామానికి చెందిన కరేపాటి గీత ఇంటర్ చదువుతున్న సమయంలో ప్రేమలో పడ్డారు. ఇరు కుటుంబాలకు చెందిన పెద్దల అంగీకారంతో వివాహం చేసుకున్నామని ఈ దంపతులు తెలిపారు. ప్రస్తుతం శ్రీకాకుళంలోని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో ఉపాధి పొందుతూ అన్యోన్యంగా జీవిస్తున్నామని ఈ ప్రేమ జంట తెలిపారు.

ఫ్లైఓవర్ కుంగుతోంది

- కొర్రాయిగేటు వద్ద ప్రమాదకర స్థితికి మారిన వైనం
- ఆందోళనలో ప్రజలు



● ఇది జాతీయ రహదారిపై కొర్రాయి గేటు వద్ద నిర్మించిన ఫ్లైఓవర్.. పలాస నుంచి ఇచ్ఛాపురం వైపు వెళ్లే మార్గంలో కుడి వైపు పిల్లర్ ఇలా స్థిరంగా ఉంది.



● అదే ఫ్లైఓవర్‌కు ఎడమ వైపు పిల్లర్ ఇలా వంగిపోయింది. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.



● ఫ్లైఓవర్ ఎడమ పక్క నుంచి వెళుతున్న సంకుజోడి కాలువ ఇది.. దీనిలో నిరంతరం నీరు ప్రవహిస్తుంది. వర్షాకాలంలో నీటి ప్రవాహం మరింత తీవ్రంగా ఉంటుంది. బ్రిడ్జి నిర్మాణ సమయంలో భూసేకరణ చేపట్టకుండా.. కాలువ సగం కప్పి... గోడ కట్టి... నిర్మించడంతో ఈ దుస్థితి నెలకొందని స్థానిక రైతులు వాపోతున్నారు.

హరిపురం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి)

జాతీయ రహదారిలో మందస మండలం కొర్రాయిగేటు వద్ద నిర్మించిన ఫ్లైఓవర్ బ్రిడ్జి ఒక వైపు కుంగిపోతోంది. నాణ్యతా లోపంతో నిర్మాణాలు చేపట్టడంతో ప్రారంభించిన రెండేళ్లకే ఈ దుస్థితి తలెత్తిందని పలువురు విమర్శిస్తున్నారు. దీంతో స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గత ఏడాదిగా ఇదే దుస్థితి ఉండడంతో గత రెండు రోజులుగా మరమ్మతులు చేపడుతున్నారు.

నాణ్యతా లోపం..

జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కొర్రాయిగేటు కూడలిలో సుమారు రూ.2.4 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ వంతెన నాణ్యతా లోపానికి నిదర్శనంగా నిలుస్తోంది. పలాస నుంచి ఇచ్ఛాపురం వైపు వెళ్లే రోడ్డులో ఫ్లై ఓవర్ ఎడమవైపు విల్లులా వంగిపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. గత ఏడాది ఇదే రోజుల్లో బీటలు వారి కాస్తా కుంగటంతో సంబంధిత కాంట్రాక్టర్ మరమ్మతులు చేపట్టారు. మరో మారు అదే ప్రాంతంలో పిల్లర్ మరింత కుంగిపోవడంతో గత రెండు రోజులుగా మరమ్మతులు చేపడుతున్నారు.

సంకుజోడి కాలువే కారణం...

ఫ్లైఓవర్ ఎడమ వైపు సంకుజోడి కాలువ ఉంది. దీనిలో నిరంతరం నీటి ప్రవాహం ఉంటుంది. వరదల సమయంలో ప్రవాహ తీవ్రత అధికంగా ఉంటుంది. ఫ్లైఓవర్ నిర్మాణ సమయంలో కాలువను పక్కకు మరలించి నిర్మాణం చేపట్టాల్సి ఉన్నా.. భూ సేకరణ సమస్యగా మారటంతో కాలువ సగ భాగం కప్పి.. గోడ కట్టి ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టారు. దీంతో అదే ప్రాంతంలో కుంగుతోందని రైతులు చెబుతున్నారు. ఏదైనా ప్రమాదం జరగక ముందే రక్షణ చర్యలు చేపట్టాలని వారంతా కోరుతున్నారు. ఇదే విషయమై సంబంధిత ఇంజనీరింగ్ అధికారి హెచ్ఎస్ హరీష్‌ను అడగ్గా... ఒక ప్రాంతంలో సమస్య ఏర్పడిందని.. దీనిపై నిపుణులతో చర్చించి రక్షణ చర్యలు చేపడుతున్నామని చెప్పారు. భవిష్యత్తులో ఎలాంటి సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని వివరించారు.

ఉసురుతీసిన చేగోడి

- గొంతులో ఇరుక్కుని చిన్నారి మృతి
- లంకపేటలో విషాదం



చిన్నారి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

రణస్థలం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): చేగోడి ఓ చిన్నారి ఉసిరితీసింది. గొంతులో ఇరుక్కొని ఊపిరాడక ఆ చిన్నారి మృతి చెందిన ఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రావాడ పంచాయతీ లంకపేట గ్రామానికి చెందిన కిల్లారి ఈశ్వరరావు, శ్రీదేవి భార్యభర్తలు. వీరికి కుమారుడు ఢిల్లీశ్వరరావు, ఏడాదిన్నర వయసు గల పాప సోణాక్షిత ఉన్నారు. పిల్లలతో వారి జీవితం సంతోషంగా సాగిపోతుంది. ఈ క్రమంలో గురువారం తల్లి శ్రీదేవి ఇంటి పనులు చేస్తున్న సమయంలో పాప సోణాక్షితకు చెగోడి ఇచ్చింది. దీన్ని తినే క్రమంలో ఆ చిన్నారి గొంతులోకి అడ్డంగా ఉండిపోయింది. దీంతో ఊపిరాడక త్రీవ అస్వస్థతకు గురైంది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కొండములగాం కమ్యూనిటీ ఆసుపత్రికి తీసుకొచ్చారు. అయితే అప్పటికే ఆ చిన్నారి మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. దీంతో ఆ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల రోదన వర్ణణాతీతం. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

స్పెషల్ బీఈడీ పరీక్ష ప్రశ్నపత్రంలో తప్పిదం

- 40కి బదులు 80 మార్కులతో పేపరు ప్రచురణ
- మూల్యాంకణంలో సరిచేస్తామంటూ కొనసాగించిన అధికారులు
- ఆందోళనలో విద్యార్థులు

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో గురువారం జరిగిన స్పెషల్ బీఈడీ ప్రథమ సెమిస్టర్ పరీక్ష ప్రశ్న పత్రంలో తప్పిదం చోటుచేసుకుంది. అకడమిక్ షెడ్యూల్ ప్రకారం ఇంటర్‌డక్షన్ టు డిజేబులిటీస్ సంబంధించిన ఈ పరీక్ష గంటన్నర సమయంలో 40 మార్కులకుగాను విద్యార్థులు రాయాల్సి ఉంది. అయితే గురువారం ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు జరిగిన పరీక్షలో 80 మార్కుల ప్రశ్నలు ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. విద్యార్థులు 40 మార్కుల విధానంలో ప్రశ్నలకు జవాబు రాసేందుకు సిద్ధం కాగా, 80 మార్కులకు పేపరు ఉండడంతో ఏ విధంగా రాయాలో అర్థం కాక అయోమయానికి గురయ్యారు.

ప్రశ్నపత్రంలో తప్పిదం జరిగిందని తెలుసుకున్న అధికారులు దాన్ని సరిచేసేందుకు అవకాశం లేకపోవడంతో మూల్యాంకనం సమయంలో దీనిని సరిచేస్తామని చెప్పి గంటన్నర సమయంలోనే 80 మార్కులకు జవాబులు రాయించారు. ప్రశ్న పత్రం సరిగా తయారయ్యిందా లేదా అని కాన్ఫిడెన్షియల్ డీన్ తనిఖీ చేయకపోవడంతోనే తామంతా నష్టపోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పీజీ ఎగ్జామినేషన్ డీన్ డాక్టర్ ఉదయ్‌భాస్కర్ దృష్టికి రాగా బీవోఎస్ ఛైర్మన్ దృష్టికి తీసుకువెళ్లి ఈ సమస్యను పరిష్కరిస్తామన్నారు.

ఆ నిబంధన సడలింపు

(ఐదో పేజీ తరువాయి)

తీసుకున్నాయి. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జరిపించాయి. జనాభా పెరుగుదలను నియంత్రించేందుకు 1994లో అప్పటి టీడీపీ ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది. ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చింది. అందులో భాగంగా ఏపీ పంచాయతీరాజ్ చట్టాన్ని అనుసరించి స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి ఇద్దరు కంటే ఎక్కువ పిల్లలున్నవారిని అనర్హులుగా తేల్చింది. అప్పట్లో ఈ నిబంధన కలకలం రేపింది. ఎంతోమంది రాజకీయ ఆశావహులపై నీళ్ల చల్లింది. దీనికి తెరదించుతూ.. తాజాగా కూటమి ప్రభుత్వం ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నా స్థానిక సంస్థల్లో పోటీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

నడి వయస్కులు, వృద్ధులే అధికం..

ప్రస్తుతం రాష్ట్రంలో యువత సంఖ్య తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం గ్రామాన్ని ఒక యూనిట్‌గా తీసుకుంటే యువత కంటే నడి వయస్కులు, వృద్ధుల జనాభా అధికంగా కనిపిస్తోంది. దీనికి కారణం కుటుంబ నియంత్రణ. ప్రస్తుతం పెరుగుతున్న ఖర్చుల నేపథ్యంలో ఇద్దరు, ఆపై ఎక్కువ మంది పిల్లలు ఉంటే చదువు, వివాహాలతోపాటు వారికి మంచి భవిష్యత్‌కు బాటలు వేయాలంటే ఇబ్బందికరమే. అందుకే ప్రస్తుతం చాలా మంది దంపతులు ఒకరినే కంటున్నారు. ఫలితంగా జనాభా తగ్గుతోంది. ఈ నేపథ్యంలో జనాభా పెరగాలన్న ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం.. స్థానిక సంస్థల పోటీకి సంతానం అర్హతను సడలించిందని తెలుస్తోంది.

జిల్లాలో పరిస్థితి ఇది..

జిల్లాలోని 912 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 647 సచివాలయాలు కొనసాగుతున్నాయి. 667 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. వీటికి 2021లో ఎన్నికలు జరిగాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చిలో స్థానిక సంస్థలకు సంబంధించి పాలకవర్గాల పదవీకాలం ముగియనుంది. ఈ తరుణంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో సంతానం అర్హతను సడలించడంపై అన్నివర్గాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

శుభ పరిణామం

గ్రామ ప్రథమ పౌరు డిగా సేవలందించాలని చాలామంది భావించా రు. కానీ స్థానిక సం స్థల్లో పోటీకి సంతానం అర్హతగా నిలవడంతో అప్పట్లో చాలామంది ఆశావహులపై నీళ్ల చల్లినట్టు అయ్యింది. ఇప్పుడు ఆ నిబంధనను తొలగించడం శుభ పరిణామం.

- దక్కత ఢిల్లీరావు, మాజీ ఎంపీపీ, ఇచ్ఛాపురం

అవకాశం దక్కుతుంది



స్థానిక సంస్థల ఎన్ని కల్లో పోటీ చేసే అభ్యర్థు లకు గతంలో సంతానం అర్హత పెట్టడంతో చాలా మందికి ప్రజాసేవ చేయాలన్న ఆలోచన ఉన్నా అవకాశం లేకుండా పో యింది. కూటమి ప్రభుత్వం ఆ నిబంధనను తొలగించడం శుభపరిణామం. ఇప్పుడు చాలా మంది ఆశావహులకు పోటీ చేసే అవకాశం దక్కుతుంది.

- రంగాల పద్మావతి, సర్పంచ్ అరకబద్ర, ఇచ్ఛాపురం

1752 మద్యం సీసాల స్వాధీనం

- వీటి విలువ రూ1.95 లక్షలు
- ఇద్దరు అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు



పట్టుబడిన మద్యం

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న రూ1,95,360 విలువ చేసే 1752 మద్యం సీసాలు రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసరావు గురువారం తెలిపిన వివరాల మేరకు.. బుధవారం రాత్రి తిప్పనపుట్టుగ జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అర్ధరాత్రి 11.30 గంటల సమయంలో ఓ వ్యాన్‌లో 1632 (180ఎంఎల్) మద్యం సీసాలు, 120 (750ఎంఎల్) బీర్ సీసాలు అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నారు. కొఠారి గ్రామం వద్ద గల ఓ వైన్‌షాపులో కపాసకుద్ది గ్రామానికి చెందిన బాబూరావు అనే వ్యక్తి మద్యాన్ని కొనుగోలు చేశాడు. ఈ మద్యాన్ని గరడాల కాళిదాస్, తన కుమారుడు గరడాల నాని వాహనంలో తరలిస్తుండగా పట్టుబడ్డారు. మద్యాన్ని స్వాధీనం చేసుకోవడంతోపాటు వారిద్దరితోపాటు మద్యం కొనుగోలు చేసిన బాబూరావును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. భారీగా మద్యం విక్రయించిన ఆ వైన్‌షాపులోని వ్యక్తులపై కేసు నమోదు చేస్తామని, అలాగే ఆ షాపు లైసెన్స్ రద్దు చేస్తామని ఎస్‌ఐ తెలిపారు.

రథసప్తమి నిర్వహణపై చంద్రబాబు అభినందన



చంద్రబాబుకు స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే శంకర్

అరసవల్లి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి రథసప్తమి వేడుకలు ఎంతో ఘనంగా నిర్వహించడంపై శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. అమరావతిలో ముఖ్యమంత్రిని ఎమ్మెల్యే శంకర్ గురువారం కలుసుకున్నారు. స్వామివారి ప్రసాదం, ఫొటోలను ముఖ్యమంత్రికి అందజేశారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఎమ్మెల్యేను అడిగి తెలుసుకున్నారు. సింగుపురం వద్ద నిర్మిస్తున్న నర్సింగ్ కళాశాల పనులు వేగవంతం చేయడానికి చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే కోరారు. జిల్లా అధికారులంతా సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయడంపై వారిని అభినందించారు.

డిగ్రీ మూడో సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్ష ఫలితాలు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం గురువారం విడదల చేసింది. బీఏ, బీకాం, బీఎస్సీ తదితర కోర్సులకు 7,258 మంది పరీక్షలకు హాజరు కాగా.. 40.62 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్టు వర్సిటీ పరీక్షల డీన్ పద్మారావు తెలిపారు. అలాగే మూడో సెమిస్టర్ సప్లమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్టు తెలిపారు. ఈ పరీక్షలకు 4,652 మంది హాజరు కాగా, 62.22 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు తెలిపారు. కాగా ఈ పరీక్షలను గత ఏడాది నవంబరు 27వ తేదీ నుంచి డిసెంరు 12వ తేదీ వరకు జిల్లాలోని 55 కేంద్రాల్లో నిర్వహించారు.

సకాలంలో లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

అరసవల్లి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సర్వీసు, ఫ్యామిలీ పింఛన్‌దారులు, జనవరి 2025 ముందు పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులు ఖజానా కార్యాలయంలో పింఛన్ తీసుకుంటున్నవారు సకాలంలో లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలని ఖజానాశాఖ ఏడీ సీహెచ్ రవికుమార్ అన్నారు. ఖజానా కార్యాలయంలో గానీ, జీవన ప్రమాణ్ ప్రభుత్వ యాప్ ద్వారా గానీ ఈ నెల 28వ తేదీలోగా తప్పనిసరిగా సమర్పించాలని కోరారు. స్థానిక డివిజన్ కార్యాలయంలో ఆయన గురువారం తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీతో పాటు ఉప ఖజానా అధికారులు సీహెచ్ రామారావు, వై.సూర్యారావు, సిబ్బంది కృష్ణారావు, బి.శ్రీధర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గణితంలో మెలకువలు నేర్చుకోవాలి

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): గణితంలో మెలకువలు నేర్చుకుంటే సులభంగా అర్థం అవుతాయని కొళిగాం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, క్లస్టర్ ఛైర్మన్ నరేంద్రకుమార్ పట్నాయక్ అన్నారు. గురువారం బొడ్డబడ ఎంపీపీఎస్ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు గణితంలో మెలకువలు నేర్పిస్తూ లెక్కలు బోధించారు. అనంతరం ప్రభుత్వం సరఫరా చేస్తున్న రాగి జావ తాగడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించి, వారితో కలిసి తాగారు.

ఘనంగా రామాలయ ప్రారంభోత్సవాలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

జి.సిగడాం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): నాగులవలసలో నూతనంగా నిర్మించిన రామాలయం ప్రారంభోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరువీధి, ప్రత్యేక పూజలు చేపట్టారు. మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ మహోత్సవంలో సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. చివరి రోజున అన్నసమారాధన ఉంటుందని ఆలయ కమిటీసభ్యులు తెలిపారు.

నృత్యకారులకు సత్కారం

శ్రీకాకుళం కల్చరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): నృత్య దర్శకుడు నీలాపు లీలాకృష్ణ బృందాన్ని సత్కరించారు. కర్ణాటకలో నిర్వహించిన ఇండియా క్లాసికల్ డ్యాన్స్ ఫెస్టివల్‌లో ఈ నెల 9న కూచిపూడి నృత్యాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. లీలాకృష్ణ బృందానికి నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

లోక్‌సభ స్పీకర్‌ను కలిసిన ఎంపీ, ఎమ్మెల్యే



లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాతో ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాను ఢిల్లీలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. కొంత సమయంలో ఆయనతో ముచ్చటించారు. విజయనగరం పార్లమెంట్ పరిధిలోని సమస్యలు, ఎచ్చెర్ల నియోజకవర్గంలోని సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

ప్రయాణికుల సంతృప్తే లక్ష్యం

అరసవల్లి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): బస్సుల పనితీరును మెరుగుపరిచి ప్రయాణికులకు సౌకర్యవంతమైన, సంతృప్తికర ప్రయాణం అందించడమే లక్ష్యమని శ్రీకాకుళం ఆర్టీసీ 1, 2 డిపోల మేనేజర్లు అమరసింహుడు, రవిశంకర్ శర్మ అన్నారు. గురువారం శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో గల నాన్-టెక్నికల్ డిపో మేనేజర్లకు శ్రీకాకుళం డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణలో బస్సు మరమ్మతులు పూర్తి చేసిన తరువాత వాటిని కండిషన్‌ను పరిశీలించే విధానం, బస్సు నిర్వహణలో వివిధ భాగాలకు సంబంధించి పరిశీలించాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలాస డిపో మేనేజర్ ఆర్ఎస్ నాయుడు, సాలూరు డిపో మేనేజరు భాస్కరరెడ్డి, పార్వతీపురం డిపో మేనేజర్లు దుర్గ, సూపర్‌వైజర్ క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రహితంగా చేయడమే లక్ష్యం



తనిఖీలు చేస్తున్న పోలీసులు

సోంపేట, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): గంజాయి రహిత సోంపేట పట్టణంగా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు సీఐ బి.మంగరాజు తెలిపారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పోలీసు జాగిలాలతో తనిఖీలు చేయించారు. దుఖాణాలను, అంబేడ్కర్ కాలనీ, కవిటి రోడ్డు, శివారు ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శ్రీకాకుళం జిల్లాలో గంజాయి లేకుండా చేసేందుకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. అనుమానాస్పద వ్యక్తులు తారాస పడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డాగ్‌స్క్వాడ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్ఐ ప్రవల్లిక

బూర్జ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని క్రమశిక్షణతో చదువుకోవాలని ఎస్ఐ ప్రవల్లిక అన్నారు. గురువారం ఓవీ పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గంజాయి, మత్తు పదార్థాలు, నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో నందమూరి రామకృష్ణ



రామకృష్ణకు స్వామివారి జ్ఞాపికను అందిస్తున్న దృశ్యం

అరసవల్లి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు కుమారుడు నందమూరి రామకృష్ణ గురువారం ఉదయం 4.30 గంటలకు దర్శించుకున్నారు. వారికి శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. వారికి స్వామివారి జ్ఞాపికను ఆలయ ఈవో వై.భద్రాజీ అందజేశారు. స్థానిక కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జి.సిగడాం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ ఉపకేంద్రంలో 33/11 కేవీ మరమ్మతులు, ఆధునికీకరణ పనులు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని శ్రీకాకుళం విద్యుత్ శాఖ ఈఈ పి.యోగేశ్వరరావు, ఏఈ పి.దుర్గా ప్రసాద్ తెలిపారు. దీంతో జి.సిగడాం, బాతువ, గెడ్డకంచరాం, నడమివలస, జాడ, ఎందువపేట, శేతుభీమవరం, గొబ్బూరు, నిద్దాం, అద్వానంపేట, చెట్టుపొదిలాం, మదుపాం, వెలగాడ, చంద్రయ్యపేట, దేవరవలస, ఎస్‌పీఆర్ పురం తదితర గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు, ఇందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

కవిటి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కవిటి మండల కేంద్రంలో డీగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని సీడాప్ మాజీ ఛైర్మన్ ఎస్.శ్యాంప్రసాద్‌రెడ్డి కోరారు. విజయవాడలో డైరెక్టర్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్ నారాయణభరత్ గుప్తను గురువారం కలిసి వినతిపత్రాన్ని అందించినట్టు తెలిపారు. ఈ ప్రాంతీయులకు ఎంతో అవసరమైన కళాశాల ఏర్పాటు చేయాలని కోరగా ఇప్పటికే ఫీజుబిలిటీ సర్టిఫికేట్ సిద్ధం చేశామని చెప్పారన్నారు. రిపోర్టు ఆధారంగా ప్రభుత్వానికి కార్యాచరణకు నివేదించనున్నామని తెలిపారన్నారు.

ఐవోసీఎల్‌లో ఉద్యోగాలకు నోటిఫికేషన్

అరసవల్లి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్)లో జూనియర్ ఆపరేటర్ గ్రేడ్-1 (215ఖాళీలు), జూనియర్ అటెండెంట్ గ్రేడ్-1 (23 ఖాళీలు దివ్యాంగులకు) ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్టు జిల్లా ఉపాధి అధికారి కె.సుధ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల నిరుద్యోగ యువతీ, యువకులు సంబంధిత వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సచివాలయ డిజిటల్ అసిస్టెంట్స్ కార్యవర్గం

కవిటి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని సచివాలయ డిజిటల్ అసిస్టెంట్స్ యూనియన్ కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లోళ్ల విజయ్, కార్యదర్శిగా గన్ని హరీష్, ట్రెజరర్‌గా బెండి వికాస్‌కృష్ణ, తోట జయదేవ్, ఆర్గనైజేషన్ కార్యదర్శిగా దున్న నవీన్‌ను ఎన్నికయ్యారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

కంచిలి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): సచివాలయాల్లో సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సకాలంలో సేవలు అందివ్వాలని ఎంపీడీవో వి.తిరుమలరావు, తహసీల్దార్ రమేష్‌కుమార్ సూచించారు. గురువారం మఖరాంపురం, పెద్దశ్రీరాంపురం గ్రామ సచివాలయాలను సందర్శించారు. పీఎం సూర్యఘర్, సూక్ష్మ చిన్న, మధ్య తరహా పరిశ్రమల సర్వే, హౌస్ జియో ట్యాగింగ్ తదితర అంశాలపై ఉద్యోగాలతో సమీక్షించారు.

రుణాల దరఖాస్తుకు మరో అవకాశం

ఆమదాలవలస, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున బీసీ కార్పొరేషన్ రుణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించనున్నట్టు నియోజకవర్గం టీడీపీ కార్యాలయం ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి పథకాల కోసం అర్హులైనవారు దరఖాస్తు చేసుకొనేందుకు ఈ నెల 12వ తేదీ చివరి రోజుగా గతంలో ప్రకటించగా, ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లేకుండా పోయిందని, అయితే లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత వచ్చే నెల మొదటి వారంలో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం అధికారులు కల్పిస్తారన్నారు.

వర్క్‌షాప్‌పై చర్చాగోష్ఠి



సమావేశంలో మాట్లాడుతున్న రమణ

ఆమదాలవలస, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెడుతున్న స్కూల్ కాంప్లెక్స్ వర్క్ షాపులు పరీక్ష ప్రశ్న పత్రాల తయారీ కేంద్రాలుగా మార్చాలని ఎస్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గురుగుబెల్లి రమణ అన్నారు. గురువారం పట్టణంలోని మండల విద్యాశాఖ కార్యాలయంలో స్కూల్ కాంప్లెక్స్ వర్క్‌షాపుపై చర్చాగోష్ఠి నిర్వహించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు పి.రామకృష్ణ, సత్యం, శ్రీను, గోపి, రమేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాలకు ఐకార్ గుర్తింపు



ఐకార్ గుర్తింపు పత్రాన్ని చూపుతున్న కళాశాల డైరెక్టర్ శ్రీరామ్మూర్తి తదితరులు

ఎచ్చెర్ల, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న ఎస్‌ఎస్‌ఆర్ పురం పరిధిలోని కింజరాపు ఎర్రన్నాయుడు కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్స్‌స్‌కు ఐకార్ (ఐసీఏఆర్ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్) గుర్తింపు లభించిందని ఆ కళాశాల డైరెక్టర్ డాక్టర్ బుడుమూరు శ్రీరామ్మూర్తి తెలిపారు. కళాశాలలో ఆయన వివరాలను వెల్లడించారు. ఇటీవల ఐకార్ నియమించిన బృందం కళాశాలను సందర్శించి మౌలిక సౌకర్యాలు, విద్యాబోధన, ల్యాబ్స్, లైబ్రరీ, వ్యవసాయ క్షేత్రాలు, విద్యార్థులు సాగుచేస్తున్న నూతన వంగడాలను పరిశీలించి ఈ గుర్తింపు ఇచ్చిందన్నారు. దీంతో వచ్చే విద్యా సంవత్సరంలో పీజీ కోర్సుల ప్రారంభానికి అవకాశం ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్య సభ్యులు డాక్టర్ టీవీఎస్ఎన్ మూర్తి, ఇప్పిలి కిశోర్, కె.దుర్గాశ్రీనివాస్, ఎస్.శ్రీనివాస్, టీఎస్ రాజా, బి.రఘుకార్తీక్, అసోసియేట్ డీన్ కె.మోష తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో పది మంది

(ఐదో పేజీ తరువాయి)

విడతలుగా శిక్షణ ఇస్తున్నామని, ఓటర్లకు వివరాలతో స్లిప్పులు అందజేస్తామన్నారు. పోలింగ్ తరువాత బ్యాలెట్ బాక్సులు ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో భద్రపరుస్తామని, మార్చి 3వ తేదీన అక్కడే ఓట్ల లెక్కింపు చేపడతామన్నారు. ఈ మేరకు ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఈనెల 25వ తేదీ సాయంత్రం నాలుగు గంటల తరువాత ప్రచారం నిర్వహించకూడదని కలెక్టర్ అన్నారు. విలేకరుల సమావేశంలో డీసీపీ అజితా వేజెండ్ల, డీఆర్వో భవానీశంకర్ పాల్గొన్నారు.

నిధులు మంజూరుకాక.. పనులు పూర్తికాక

● ఇదీ పెద్దసీది జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో మరుగుదొడ్ల పరిస్థితి


పెద్దసీదిపాఠశాల ఆవరణలో నిలిచిపోయిన మరుగుదొడ్ల పనులు

పాతపట్నం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దసీది జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణాలు నిధులు మంజూరుకాక పోవడంతో పూర్తికాలేదు. దీంతో విద్యార్థులు అవస్థలకు గురవుతున్నారు. నాడు-నేడు రెండోఫేజ్ పనుల్లో భాగంగా పెద్దసీది జడ్పీ హెచ్ఎస్‌లో రూ.63 లక్షల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించారు. అయితే నిధులు పూర్తిస్థాయిలో మంజూరుకాకపోవడంతో పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి.ఇక్కడ 260పైగా విద్యార్థులు చదువుతున్నారు. గతంలో నిర్మించిన మరుగుదొడ్లు సైతం పాడయ్యాయి. వీటికి సైతం కనీస మరమ్మతులుచేయడంలేదని విద్యార్థులు వాపోతున్నారు. ఈనేపథ్యంలో మరుగుదొడ్లు లేకపోవడంతో మలమూత్ర విసర్జనలకు ఆరుబయటకు వెళ్లాల్సివస్తోందని పలువురు విద్యార్థులు వాపోతున్నారు. తక్షణమే మరుగుదొడ్లు పూర్తిచేయాలని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

లక్ష్మీనర్సుపేట జంక్షన్‌లో కంపు.. కంపు

● రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్త ● ప్రయాణికులు, వాహనచోదకుల అవస్థలు

ఎల్.ఎన్.పేట, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): లక్ష్మీనర్సుపేటజంక్షన్ నుంచి గ్రామంలోకి వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరుపక్కల చెత్త కుప్పలు పేరుకుపోవడంతో కంపుకొడుతోందని వాహనచోదకులు, ప్రయాణికులు, గ్రామస్థులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. నెలలతరబడి చెత్తకుప్పలు పేరుకుపోవడంతో కుళ్లడం వల్ల దుర్వాసన వెలువడుతోంది. ఇక్కడి వచ్చేసరికి ముక్కుమూసుకుని దాటాల్సివస్తోందని పలువురు వాహనచోదకులు వాపోతున్నారు.ఈరోడ్డు గుండా పెద్దకోట, బసవరాజుపేట, లక్ష్మీనర్సుపేట, మిరియాపల్లి, వాడవలస, ఇందిరానగర్ కాలనీవాసులు నిత్యం వాహనాలు, కాలినడకన రాకపోకలు సాగిస్తుంటారు. చెత్తకుప్పలు పేరుకుపోవడం వల్ల దోమలు విజృంభిస్తుండడంతో వ్యాధులు ప్రబలే అవకాశముందని ఆందోళన నెలకొంది. చెత్తనుంచి సంపద తయారుచేసే కేంద్రాలు ఉన్నా చెత్తను అక్కడికి తరలించకుండా రోడ్డుపక్కనే వేస్తుండడంపై గ్రామస్థులు, వాహనచోదకులు సిబ్బందిపై మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు రోడ్డు పక్కన ఉన్న చెత్తకుప్పలు తొలగించాలని కోరుతున్నారు.


లక్ష్మీనర్సుపేట వెళ్లే రోడ్డు మార్గంలో పేరుకుపోయిన చెత్తకుప్పలు

రక్షణ గోడలు కూలి.. వంతెనలు శిథిలావస్థకు..

● ఇదీ మందస-మెళియాపుట్టి రహదారిలో పరిస్థితి


హరిపురం,ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మందస- మెళియాపుట్టి రహదారిలో నిత్యం వందలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే సందూరు, కిల్లోయి, వద్ద రోడ్డు వంతెనలు శిథిలావస్థకు చేరు కున్నాయి. దీంతోపాటు ఆయా ప్రాంతాల్లో కల్వర్టులు రక్షణగోడలు కూలిపోవడంతో ప్రయాణికులు, వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు.ప్రధానంగా మందస-మెళియాపుట్టి రహదారి సింగిల్‌కావడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు తప్పించే క్రమంలో చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు.పలుచోట్ల రక్షణ గోడలు కూలిపోవడంతో చీకటిపడిన తర్వాత వచ్చి పోయే ద్విచక్ర వాహన చోదకులు భయాందోళన చెందుతున్నారు. వంతెనలు శిథిలావస్థకు చేరడంతో వర్షాకాలంలో ఏక్షణంలో కూలిపోతాయోనని బిక్కుబిక్కుమని వాహనాలు నడపాల్సివస్తోందని వాహనచోదకులు చెబుతున్నారు. రక్షణ గోడలు, వంతెనలకు మరమ్మతుల చేయాలని పలువురు కోరుతున్నారు.


సందూరు వద్ద పూర్తిగా కూలిపోయిన కల్వర్టు

పీడీఎస్ బియ్యం స్వాధీనం

కంచిలి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని దాకరాపల్లి కూడలిలో గురువారం అక్రమంగా వ్యాన్‌లో తరలిస్తున్న 3,560 కిలోల పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సీఎస్‌డీటీ కూర్మారావు తెలిపారు. సీఎస్‌డీటీ కథనం మేరకు.. వ్యాన్ డ్రైవర్ రమేష్‌ను విచారించారు. కంచిలికి చెందిన కొత్తకోట నాగరాజు లబ్ధిదారుల నుంచి బియ్యం సేకరించిన బియ్యాన్ని ఒడిశాలోని బరంపురం అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.1,61,980 ఉంటుంది.బియ్యం స్వాధీనంచేసుకుని, వాహనాన్ని సీజ్ చేశారు. దాడుల్లో విజిలెన్స్ ఎస్ఐ రామారావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు: ఎస్పీ


కొత్తూరు పోలీస్‌స్టేషన్ ఆవరణలో పరిశీలిస్తున్న మహేశ్వరరెడ్డి

కొత్తూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అలసత్వంవహిస్తేసహించేదిలేదని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం కొత్తూరు పోలీస్‌స్టేషన్‌లో వార్షిక తనిఖీల్లో భాగంగా రికార్డులను పరిశీలించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లోఉన్న నేరపరిశోధనవివరాలపై ప్రశ్నించారు.క్రైమ్ రేటును తగ్గించేందుకు చేపట్టాల్సినచర్యలపై సూచనలిచ్చారు. నేరాలు, సైబర్ నేరాల నివారణ, పేకాట శిబిరాలు, అక్రమమద్యం, మాదకద్రవ్యాల వినియోగం నియంత్రణపై సిబ్బందికి వివరించారు.కార్యక్రమంలో డీఎస్పీ ఏడీఎస్ మూర్తి, సీఐ చింతాడ ప్రసాద్, ఎస్ఐ మహమ్మద్ అమీర్ ఆలీ పాల్గొన్నారు.

నగరవనం పనులు వేగవంతం చేయండి

● జిల్లా అటవీశాఖ అధికారి వెంకటేష్ ఆదేశం


రోడ్డు పనుల నాణ్యతను పరిశీలిస్తున్న వెంకటేష్

పలాస, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కోసంగిపురం మెండు అటవీభూముల్లో నగరవనం పనులు వేగవంతం చేయాలని జిల్లా అటవీశాఖ అధికారి ఎస్.వెంకటేష్ అధికారులను ఆదేశించారు. గురువారం కాటేజీలు, రహదారులు, పార్క్ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాలోనే ఎక్కడా లేని విధంగా నగరవనం తీర్చిదిద్దుతున్నామని,భవిష్యత్తులో పర్యాటకులకు ఎంతో ఆకట్టుకుంటుందని తెలిపారు.ఆయనవెంట పలాసఅటవీశాఖ అధికారి మురళీకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

రచయితగా రాణిస్తూ.. దర్శకుడిగా పనిచేస్తూ..

● బ్రహ్మ ఆనందం సినిమాకు టెక్కలి యువకుడి దర్శకత్వం


రొక్కం వెంకట్ సాయినిఖిల్

టెక్కలి,ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): టెక్కలికి చెందిన రొక్కం వెంకట్ సాయినిఖిల్ రచయిత, దర్శకుడిగా రాణిస్తున్నాడు. తండ్రి ఆర్‌వీ మోహన్ హైదరాబాద్‌లో రైల్వే ఉద్యోగి కాగా తల్లి అరుణ గృహిణిగా ఉంటున్నారు. సాయినిఖిల్ హైదరాబాద్‌లో బీటెక్‌లో ఈఐఈ పూర్తిచేసి సినిమా రంగం వైపు ఆసక్తి పెంచుకొని బ్రహ్మ ఆనందం సినిమాకు రచయితగా, దర్శకుడిగా వ్యవహరించాడు. హ్యాపీ ఫ్యామిలీ డ్రామా తాతా, మనవడు ఇతివృత్తంగా తెరకెక్కించిన ఈ సినిమా శుక్రవారం ప్రేమికుల దినోత్సవం పురస్కరించుకుని రిలీజ్ చేయనున్నారు. ఈమేరకు ప్రీరిలీజ్ ఈవెంట్ బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించగా మెగాస్టార్ చిరంజీవి హాజరై సాయినిఖిల్‌కు అభినందించారు. కాగా తనకు చిన్నప్పటి నుంచి సినీరంగం పట్ల ఆసక్తి ఉందని సాయినిఖిల్ తెలిపాడు.

దోషులపై చర్యలు చేపట్టండి

● ప్రజాసంఘాల నాయకుల డిమాండ్

పలాసరూరల్,ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి):మండలంలోని చిననీలావతికి చెందిన పౌరహక్కుల సంఘం సభ్యుడు తెప్పల ఢిల్లీరావు జనవరిలో తన పొలంలో హత్యకు గురైన సంఘటనలో దోషులను కఠినంగా శిక్షించేలా పోలీసులు చర్యలు చేపట్టాలని ప్రజాసంఘాలు డిమాండ్‌చేశాయి. ఈమేరకు గురువారం మండలంలోని బొడ్డపాడులో నిర్వహించిన సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు పత్రి దానేసు, వంకల మాధవరావు,మద్దిల రామారావు, సోమనాథం, పూర్ణచంద్రరావు, సాలీన వీరాస్వామి, మద్దిల ధర్మారావు మాట్లాడారు. రెండుమూడు రోజుల్లో దోషులను పట్టుకొని శిక్షిస్తామని అప్పట్లో పోలీసులు తెలియజేశారని, ఇప్పటికీ ఈ విషయంపై పోలీసులు విచారణ దశలో ఉందని చెప్పడం సరికాదని పేర్కొన్నారు. తక్షణమే పోలీసుయంత్రాంగం ఈ హత్యపై దృష్టిపెట్టి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థినుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

మెళియాపుట్టి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని డిప్యూటీ డీఎండ్‌ఎండ్‌హెచ్‌వో మేరీ తెలిపారు. గురువారం మెళియాపుట్టి ఆరోగ్యకేంద్రంతో పాటు కేజీబీవీ పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యకేంద్రంలో డెలవరీలను పెంచాలని తెలిపారు. ఆరోగ్యకేంద్రంలో నైట్ వాచ్‌మెన్‌తో పాటు సీనియర్ అసిస్టెంట్ లేక ఇబ్బందులు పడుతున్నాట్లు సిబ్బంది తెలియజేశారు. విద్యార్థులకు ప్రతి నెల వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ఆమెతో పాటు వైద్యాధికారి గ్రీష్మ, కేజీబీవీ హెచ్ఎం రమ్య తదితరులు ఉన్నారు.

దశలవారీగా సమస్యల పరిష్కారం

● పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష


కాశీబుగ్గ: శిరీషకు సమస్యలు వివరిస్తున్న 16వ వార్డు యువకులు

కాశీబుగ్గ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తానని పలాస ఎమ్మెల్యే గౌతుశిరీష హామీఇచ్చారు. గురువారం పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలోని 16వవార్డులో పర్యటించారు. ఈసందర్భంగా ఇక్కడ గాంధీనగర్‌కు ఆనుకొని ఉన్న ఓంశాంతి ఆశ్రమం ఎదురుగా రోడ్‌లో, శ్మశానం వాటికకు వెళ్లడానికి దారి లేదని శిరీషకు వార్డు ప్రజలు వినతిపత్రం అంద జేశారు. శ్మశాన వాటికకు వెళ్లడానికి రోడ్డు కూడా లేదని వివరించారు. డ్రైనేజీలు, నీటి సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఆమె వెంట ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు, జి.సూర్యనారాయణ, సప్ప నవీన్‌కుమార్, చంద్ర ఉన్నారు.

● హరిపురం, ఫిబ్రవరి13 (ఆంధ్రజ్యోతి): కళింగదల్, దామోదరసాగర్, డబార్సింగి రిజర్వాయర్లను ఆధునికీకరించాలని ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. ఈ మేరకు శ్రీకాకుళంలోని ఎస్ఈకార్యాలయంలో జలవనరులశాఖ ఎస్ఈ వి.కృష్ణారావును కలిశారు. రిజర్వాయర్ల ఆధునికీకరణతోపాటు నీటి నిల్వ సామర్థ్యం, కాలువలు, మదుములు మరమ్మతులు, సిమ్మెంటు కట్టడాల పునర్నిర్మాణంపై చర్చించారు. ప్రతిపాదనలు సిద్ధం చేస్తే సంబంధిత మంత్రిని కలిసి నిధులు మంజూరయ్యేలా కృషిచేస్తామని ఆమె చెప్పారు. కార్యక్రమంలో పీరుకట్ల విఠల్, ఏఈఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● పలాసరూరల్,ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి):పలాస ఏపీఎన్జీవో హోం నిర్మాణానికి నిధులు విడుదలచేసి పూర్తి చేయాలని ఈ సంఘ అధ్యక్షులు బోనెల గోపాల్, కార్యదర్శి బి.ఉపేంద్రరావు, వైస్‌ప్రెసిడెంట్ పి.శ్రీనివాసరావు, ఎస్.పాపారావు కోరారు.ఈ మేరకుపలాసలో ఎమ్మెల్యే శిరీషకు వినతిపత్రం అందజేశారు.

పట్టుమహాదేవి కోనేరు పరిశీలన


కోనేరుగట్టు వివరాలు సేకరిస్తున్న జీవీఎంసీ సలహా సంఘం ప్రతినిధులు

టెక్కలి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): టెక్కలిలోని పట్టుమహాదేవి కోనేరును విశాఖ జీవీఎంసీ సలహా ప్రతినిధుల బృందం గురువారం పరిశీలించింది. ఎయిర్‌పోర్టు అథారిటీ ఐదుకోట్ల రూపాయల సీఎస్ఆర్ నిధులు వినియోగానికి కేంద్ర,రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడులు కృషి మేరకు నిధులు మంజూరైన విషయం విదితమే. ఈమేరకు పట్టుమహాదేవి కోనేరుకు సంబంధించి కొంతమేర సీఎస్ఆర్ నిధులు వెచ్చించిందుకు గాను పూడికలు, గట్టుపై ఉన్న పరిస్థితులు ఆ బృందం వివరాలు సేకరించింది. వీరి వెంట టీడీపీ మండలాధ్యక్షులు బగాది శేషగిరి, లవకుమార్, ప్రసాద్‌రెడ్డి, ప్రపుల్లా, సాహుకారి మోహనరావు తదితరులు ఉన్నారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి: పీవో


ఆసుపత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న యశ్వంత్‌కుమార్‌రెడ్డి

కొత్తూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పరిధిలో ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది రోగులకు అన్ని వేళల్లో అందుబాటులో ఉండాలని పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి కోరారు.ఈ మేరకు గురువారం కొత్తూరు సీహెచ్‌సీలో తనిఖీ చేశారు. అనంతరం పలువురు రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందజేస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు.రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని కోరారు. సిబ్బంది హాజరును పరిశీలించారు.కార్య క్రమంలో సూపరింటెండెంట్ కిషోర్‌కుమార్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి: ఏపీడీ


తురకపేటలో ఇంకుడుగుంతలు పరిశీలిస్తున్న రాధ

ఎల్.ఎన్.పేట, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పనుల్లో సమయపాలన పాటించడంతో పాటు నిబంధనల ప్రకారం జరగాలని ఉపాధిహామీ పథకం హిరమండలం క్లస్టర్ ఏపీడీ పి.రాధ తెలిపారు. గురువారం మండలంలోని తురకపేట గ్రామానికి సంబంధించిన తురకవానిచెరువులో జరుగుతున్న పనులతోపాటు ఇళ్లముందు జరుగుతున్న ఇంకుడు గుంతల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనుల్లో అక్రమాలు జరగకుండా సిబ్బంది పర్యవేక్షించాలని కోరారు. ఇంకుడు గుంతలను శతశాతం నిర్మాణాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట ఏపీవో శ్రీదేవి, పంచాయతీకార్యదర్శి జి.తవిటినాయుడు, టీఏ ఆర్.మన్మథరావు, ఫీల్డ్ అసిస్టెంటు పద్మలు పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి: బగ్గు

జలుమూరు (సారవకోట) ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు. సారవకోట మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక లైంగికదాడికి గురవడంతో గురువారం కుటుంబాన్ని రమణమూర్తి పరామర్శించారు. ముద్దాయిపై పోక్సో కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని పోలీసులను కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు కత్తిరి వెంకటరమణ, ధర్మాన తేజకుమార్, సురవరపు తిరుపతిరావు, బైరి భాస్కరరావు, పట్ట ఉమారావు పాల్గొన్నారు.

వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు ఝాన్సీరాణి


ఝాన్సీరాణి

టెక్కలి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి):టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం బీఏ చదువుతున్న ఎస్.ఝాన్సీరాణి ఆల్‌ఇండియా ఇంటర్ జోనల్ వెయిట్ లిఫ్టింగ్(ఉమెన్స్) చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైందని ప్రిన్సిపాల్ డాక్టర్ గోవిందమ్మ తెలిపారు. ఈ పోటీలు శుక్రవారం నుంచి ఈనెల 17 వరకు హిమాచల్‌ప్రదేశ్ సెంట్రల్ యూనివర్శిటీలో జరగనున్నాయని చెప్పారు.కాగాడాక్టర్ సతీష్‌కుమార్ లూక్‌పాల్,వ్యాయామఅధ్యాపకులు సత్యనారాయణ, కోచ్ ఈశ్వరరావు కూడా ఝాన్సీకి అభినందించారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు పందిరిరాట


పందిరిరాట వేయడానికి పూజచేస్తున్న ఈవో ప్రభాకరరావు అర్చకులు

జలుమూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగంలో ఈనెల 26 నుండి 28 వరకు నిర్వహించనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు పురోహితులు బంకుపల్లి మధుశర్మ నేతృత్వంలో ఈవో పి.ప్రభాకరరావు గురువారం పందిరిరాట(శుభరాట) వేశారు.పందిర్రాట వేసిన మరుసటిరోజు నుంచి ఉత్సవాలు పనులు ప్రారంభిస్తున్నట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు శేషాద్రి వెంకటాచలం, నారాయణమూర్తి, శ్రీకృష్ణ, శివ, అప్పారావు, సర్పంచ్ టి.సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

పాతపట్నంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠ

పాతపట్నం, ఫిబ్రవరి13 (ఆంధ్రజ్యోతి): స్థానిక షిర్డీగిరి సమీపంలో గల అయ్యప్పవారి దేవాలయప్రాంగణంలో ధ్వజస్తంభాన్ని గురువారం ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా 1300 కలశాలతో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం జరిగిన అన్న సంతర్పణ కార్యక్రమం ఏర్పాటుచేశారు.

బర్డ్‌ఫ్లూ లక్షణాలు లేవు

కోటబొమ్మాళి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం బర్డ్‌ఫ్లూ వ్యాధి లక్షణాలు ఏమీ లేవని, ఒకవేళ ఎవరికైనా ఆ లక్షణాలు కనిపిస్తే పశువైద్య కేంద్రానికి సమాచారం ఇవ్వాలని కోటబొమ్మాళి పశువైద్యాధికారి లఖినేని కిరణ్‌కుమార్ తెలిపారు. గురువారం కోటబొమ్మాళి లోని చికెన్ సెంటర్లను సహాయ సంచాలకుడు ఎం.లోకనాథం పర్యవేక్షణలో ఇద్దరు పశువైద్యాధికారుల ఆధ్వర్యంలో రెండు టీములుగా సందర్శించి వ్యాపారులతో మాట్లాడారు. ఈసందర్భంగా కిరణ్‌కుమార్ బర్డ్‌ఫ్లూ వ్యాధి లక్షణాలను వివరించారు. కోళ్లఫారం నిర్వాహకులు తమ ఫారం వద్దకు కొత్తవ్యక్తులు, వాహనాలు రాకుండాచూసుకోవాలని ఆదేశించారు. ఈ వ్యాధి వలన పక్షుల ద్వారా ప్రబలే అవకాశం ఎక్కువగా ఉందని, ఏదైనా కోడి చనిపోతే దాన్ని దూరంగా తీసుకు వెళ్లి కాల్చటం, లేదా పూడ్చడం చేయాలన్నారు.

● జలుమూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి):బ్రాయిలర్ కోళ్లకు వ్యాధులు సోకితే తక్షణమై సమాచారం ఇవ్వాలని అచ్యుతాపురం పశువైద్యాధికారి పట్ట సంతోష్ తెలిపారు.యలమంచిలి, అక్కురాడ గ్రామాల్లో గల పౌల్ట్రీ కోళ్ల ఫారాలను సందర్శించారు. ఈసందర్భంగా యజమానులకు కోళ్లకు వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు.

మెరిసిన సిక్కోలు బ్లూ గ్రానైట్


ప్రదర్శనలో నీలిరంగు గ్రానైట్ ఉత్పత్తులు

టెక్కలి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్ మైదానంలో గురువారం నిర్వహించిన 16వ అంతర్జాతీయ గ్రానైట్ స్టోనాలో శ్రీకాకుళం బ్లూ గ్రానైట్ ప్రత్యేకఆకర్షణగా నిలిచింది.అంతర్జాతీయస్థాయిలో జరిగిన ఈ ప్రదర్శనలో 253 రకాలకు పైగా కలర్ గ్రానైట్స్‌ఉత్పత్తులను ఉంచారు. దేశ, విదేశాలకు చెందిన ఈ మోర్నమెంట్‌ను పరిశీలించారు. నీలిరంగు గ్రానైట్ ఉత్పత్తులపై యూరప్ దేశాలకు చెందినకొనుగోలుదారులు ఎక్కువగా ఆసక్తి చూపారు. మొదటిరోజు ఈ స్టోనాలో ఆమదాలవలస ఎమ్మెల్యే, గ్రానైట్ క్వారీ యజమాని కూన రవి కుమార్, మోర్నమెంట్ ఫ్యాక్టరీ యజమాని డాక్టర్ బాలరాజు, కటింగ్ అండ్ పాలిషింగ్ యూనిట్ జిల్లా అధ్యక్షులు నవీన్‌చౌదరి, గ్రానైట్ వ్యాపారవేత్తలు కింజరాపు సురేష్, అల్లు నగేష్‌లు పాల్గొన్నారు.

అవగాహనతోనే కుష్ఠు వ్యాధి నిర్మూలన

నరసన్నపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): అవగాహనతోనే కుష్ఠువ్యాధిని నిర్మూలించుకోవచ్చని జిల్లా కోఆర్డినేటర్ వి.వేంకటేశ్వరరావు తెలిపారు. గురువారం మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో కుష్ఠువ్యాధి నివారణ పక్షోత్సవాలు ముగింపు పురస్కరించుకుని బ్రైటర్ ఫ్యూచర్‌డెవలప్‌మెంట్‌సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీలు, మానవహారాలు నిర్వహించి కుష్ఠు వ్యాధిపై అవగాహన కల్పించారు.


నరసన్నపేట ఉన్నతపాఠశాలలో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హరిపురం, ఫిబ్రవరి13 (ఆంధ్రజ్యోతి): మందసమండలంలోని గ్రామాలకు పలాస సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, ఆర్‌డీఎస్ఎస్ నిర్వహణ దృష్ట్యా శుక్రవారం ఉదయం పదినుంచి సాయంత్రం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ యజ్ఞేశ్వరరావు ఒకప్రకటనలో తెలిపారు.

● జలుమూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుడితి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గల ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టెక్కలి విద్యుత్ ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు.ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు శ్రీముఖలింగం, అచ్యుతాపురం, యలమంచిలి, కొమనాపల్లి, సురవరం, అంధవరం, పర్లాం, మాకివలసకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

● జలుమూరు(సారవకోట), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సారవకోట మండలంలోని బుడితి సబ్‌స్టేషన్‌లో పరిధిలో గల బుడితి, అవలింగి, చీడిపూడి, తొగిరి, కిన్నెరవాడ, బద్రి, గుమ్మపాడు, బైదలాపురం, గోపాలపురం తదితర గ్రామాలకు శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టెక్కలివిద్యుత్ ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

నేటి నుంచి దుర్గాదేవి అమ్మవారి జాతర ఉత్సవాలు

పోలాకి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): సుసరాంలోని దుర్గాదేవి అమ్మవారి 47వ జాతర మహోత్సవాలు శుక్రవారం నుంచి ఐదురోజులపాటు నిర్వహించనున్నట్లు ఆలయ శాశ్వత ధర్మకర్త సనపల అప్పలసూరి తెలిపారు. గురువారం సుసరాంలో విలేకరులతో మాట్లాడుతూ జాతరకు ఇతర జిల్లాల నుంచి భక్తులు హాజరుకానుండడంతో పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశామని చెప్పారు.

రేపు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

హిరమండలం, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు క్లస్టర్ల పరిధిలో స్కూల్‌కాంపెక్స్ సమావేశాలు శనివారం నిర్వహించాలని ఎంఈవో కె.రాంబాబు ఒక ప్రకటనలో కోరారు. హిరమండలం, అవలంగి, భగీరధపురం కాంప్లెక్స్‌ల విద్యాకమిటీ చైర్మన్ల ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించాలని తెలిపారు.

18న హుండీ లెక్కింపు

జలుమూరు, ఫిబ్రవరి 13: (ఆంధ్రజ్యోతి) శ్రీముఖలింగేశ్వరస్వామి ఆలయ హుండీని దేవదాయశాఖ అధికారులు సమక్షంలో ఈనెల 18న తెరచి లెక్కిస్తున్నట్లు ఈవో పి.ప్రభాకరరావు తెలిపారు. ఆసక్తి గల గ్రామపెద్దలు, అర్చకులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

జంగిల్ క్లియరెన్స్

నందిగాం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని నరేంద్రపురం జంక్షన్ నుంచి వల్లభరాయుడుపాడు వెళ్లే రహదారిలో జంగిల్ క్లియరెన్స్ ఎట్టకేలకు చేపట్టారు. ఈరహదారిలో జంగిల్స్ పేరుకుపోవడంతో వాహనచోదకులు ఇబ్బందులుపడుతున్నారు. ఈమేరకు అధికారులు రోడ్డుకు ఇరువైపులాఉన్న పొదలు, డొంకలను యంత్రాలతో తొలగించారు. దీంతో కొండపేట,వేణుగోపాలపురం, వల్లభరాయుడుపాడు, దేవాడ, డీఆర్‌సీపురం వెళ్లే వాహనచోదకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

'ఉద్దానం గుండెచప్పుడు' పాటల సంకలనానికి ఆహ్వానం

పలాస రూరల్, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): ఉద్దానం జీవన విధానం, భౌగోళిక మేళవింపు, గొప్పతనం తెలియజేసేలా ఉద్దానం గుండెచప్పుడు పేరుతో పాటల సంకలనానికి ఆహ్వానిస్తున్నట్లు ఉద్దానం రచయితల సంఘం(ఉరసం)వేదిక అధ్యక్షుడు కుత్తుమవినోద్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఉద్దానం చారిత్రాత్మకమైన విశిష్టతనుతెలియజేసేలా సామాజిక గేయాలు, పాటలను రాసి 963431 4502 వాట్సాప్ నెంబరుకు పంపించాలని తెలిపారు. ఈ సాహిత్యాన్ని పుస్తక రూపంలో సంకలనం చేసి విడుదల చేయనున్నట్లు తెలిపారు.ఆసక్తి గల రచయితలు, కళాకారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.